

వరండాలో టీపాయ్ ముందు కుర్చీలో ఒంటరిగా కూర్చున్న మనిషి ఆవరణకున్న గేటు ఎవళ్లో తీస్తున్న చప్పుడు వినపడి చేతిలో పైకెత్తిన సీసా అలాగే పట్టుకుని నొసలు చిట్లించి అటువైపు చూసేడు. గేటు తీసిన మనిషి లోపలికి ఒక అడుగు వేసి అప్పు చూసి అక్కడే ఆగిపోయి అడిగేడు.

"రాకారాజుగారు ఉన్నారా?"

ఆగంతుకుని కళ్లు ఆ లోపల అంతా జీబుగా పెరిగి పోయిన గడ్డిమీదా కలుపు మొక్కలమీదా వాలేయి. ఇంటి మెట్లనుంచి గేటుదాకా రెండు వైపులా ఒకప్పు డెప్పుడో నీటుగా శ్రమగా పెంచిన మల్లె మొక్కలు ఎవళ్లూ తమను గురించి పట్టించుకోకపోవడంతో అడ్డదిడ్డంగా పెరిగి గడ్డిలో కలిసిపోయి ఇప్పుడు ఈ సంజ చీకటో అవి అడవి మొక్కలలాగే కనపడు తున్నాయి, తెల్లని మొగ్గలూ పూలూ ఉన్నా అక్క డక్కడ. ఒకప్పుడు మూడంగుళాల కన్నా ఎక్కువ ఎత్తుగా పెరగడానికి అవకాశం దొరకని గడ్డిలో

మనసు చంచలమైనదే కాదు, బలహీనమైనది కూడా. మనిషి ఉత్తముడు, ఉన్నతుడు అయినా మనసు స్వాధీనంలో ఉండకపోవచ్చు. ఒక పర్యాయం ఎప్పుడైనా ఒక దుర్ముహూర్తంలో బలహీనతకు లోనైన మనసు మరలించుకొనే మార్గం కనుపించదు. ఈ సంఘర్షణ ఫలితంగా మమత మరల మరల చిగిర్చి మనిషినే నాశనం చేస్తుంది. విమోచనం ఎప్పటికో, ఎలాగో తెలియదు.

కుండానే తాగేసేడు అతడు. బల్లకింద ఉన్న మరో ఖాళీసీసా పక్కకు జోడుగా తోడుగా వెళ్ళింది ఆ సీసా. అతడు కుర్చీలో వెనక్కు జేరబడి చేతులు గుండెలమీద పెట్టుకుని కళ్ళు మూసుకున్నాడు. సత్యం అతనివైపు వింతగా చూస్తున్నాడు. కళ్ళు మూసుకున్న అతన్ని మరి మాట్లాడించడం సబబు కాదనుకున్నాడు. తెరుచుకు పోయిఉన్న నోటినుంచి గుర్రుమని చప్పుడు మొదలైంది రాజనాథం గొంతులోనుంచి. ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా ఉన్న సత్యం ముందు ఆ చప్పుడు ఏమిటో అనుకుని తరవాత బోధపరుచుకున్నాడు. లేచి నిలబడి ఎడమవైపున ఉన్న మెట్లవైపు ఒకసారి చూసేడు. ఇంతలో బంగారి కిలుమెక్కిపోయి సొట్టలు పడ్డ ఇత్తడి గళాసులో టీ తెచ్చి అతనికివ్వబోయింది.

సత్యం అన్నాడు: "అయ్యగారికి?"

గుర్రుపెట్టి నిద్రపోతున్న రాజనాథంవైపు చూసి అంది బంగారి: "ఈ నీళ్ళు సిన్నయ్యకి పడవ్. అయినా మరి రాత్రి పదివరకూ నేవడ్లే క్రుచ్చుకు బాదినా సరే! అయిపోనాది పని. అప్పుడే రెండు సీసాలూ ఖాళీ చేసేసినాడు."

టీ అందుకుని తాగి గళాసు ఆమెకు ఇచ్చేసేడు సత్యం. ఆమె వెళ్ళిపోతూంటే ఆమె వెనక తానూ లోపలి గది గుమ్మంవరకూ వెళ్ళి అన్నాడు:

"ఓడవ్వా!"

"ఏటయ్యగోరూ?"

"గిరిజమ్మ మేడమీదున్నారని చెప్పేరు చిన్నయ్యగారు. ఒకసారి వెళ్ళి ఆవిడికి చెప్తావా ఎవరో వచ్చేరని?"

"అవ్వో! ఆ సుద్దగీత దాటి అడుగేస్తే సిన్నయ్య నరికేయడూ నన్ను? మీరే ఎల్లండి పైకి. ఎవల్లూ ఏమీ అనరు." బోసినోటితో నవ్వింది బంగారి.

ఆగి తటపటాయించి రాజనాథంవైపు చూపు పోనిచ్చి ఆ గుమ్మంలోపలికి అడుగువేసి అన్నాడు సత్యం: "అవును గాని, అవ్వా, ఆపైన గిరిజమ్మా ఆవిడ బర్తా ఉంటున్నారా?"

ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసి అతన్ని చూసి అంది బంగారి: "బర్తా? అదేటయ్యగోరూ? మీకు తెలీదేటి? ఇవాహమై సవచ్చరం తిరక్కుండానే తల మాసింది ఆయమ్మకి. దురదురొష్టంతురాలు. ఈ సిన్నయ్యా అంతే. ముహూర్తం కూడా కుదిరి అన్నీ సిద్ధమైనాక అటాత్తుగా పెద్దయ్య కన్ను మూసేసేడు. పెళ్ళీ పెటాకులూ నేకుండా ఉన్నదంతా ఊడ్చేత్తూ మిగిలిపోనాడీ సిన్నయ్య. ఏటో ఈ ఇంటికి ఏల్నాటి శని పట్టింది. అప్పుడే ఆరు సవచ్చరాలు నిండిపోనాయి —పెద్దయ్య పరలోకమై." కళ్ళవెంట పుసులతో జారుతూన్న నీరు తుడుచుకుంటూ అంది బంగారి: "ఏదో ఈ ఇంట్లో సిన్నయ్యని కనిపెట్టుకున్నాను. అక్కాతమ్ముళ్ళకి మద్దెనివచ్చగిడ్డేత్తే బెల్లమనిమంటా. ఎంత ఆసపడి పెద్దయ్య సేసేడో అన్నీ అంత అద్దాన్నంగా తయారయ్యేయి. పాపం ఒక్కగాను ఒక్క కూతురు. బోలెడాస్తి. మగనలుసు నొకణ్ణి దత్తం సేసుకోని సగవాస్తి ఆడికీ, సగం గిరిజమ్మకీ ఇచ్చి కొడుకూ, కోడలూ, కూతురూ అల్లుడూ, పిల్లా జెల్లాతో ఈ లోగిడి కళకళలాడ్తా ఉంటే సూద్దామని ఎంత సంబరపడ్డాడో! సివరికి కళ్ళెదుటే కూతురిలా అయిపోడం. సిన్నయ్యిలా తందనాలాడ్డం. ఆస్తి పంపకాలెట్టేసి, గుండెపగిలి సచ్చిపోనాడు పెద్దయ్య. అభాగ్గి జీవి!"

తలుపు రెక్కకు జేరబడి దిగాలుగా శూన్యంలోనికి చూస్తూ ఉండిపోయాడు సత్యం. బంగారి జాలిగా అతనివైపు చూసి అంది:

"ఏరేమన్నా ఈళ్ళకి సుట్టాలేటి, అయ్యగోరూ?"

సరుదుకుని సత్యం అన్నాడు: "కాను. ఏమీకాను నేను. ఈ ఇంట్లో ఉండేవాణ్ణి ఇదివరకు. వాళ్ళ నెరుగుదును. అంతే. వస్తా నవ్వా."

"మంచిది, నాయనా. టీ బావుందీ?"

"బావుం దవ్వా. చాలా బాగుంది." మనసూర్తిగా అన్నాడు ఆ మాట. అటువంటి వాతావరణంలో అంత మంచి టీ దొరుకుతుందని కలలోకూడా అనుకోలేదు అతడు. బంగారి లోపలికి వెళ్ళిపోయింది. అతడు పైకి చచ్చి ఏ లోకంలోనో ఉన్న రాజనాథాన్ని నిరసనగా ఒకసారి చూసి అతని కుర్చీ వెనక సుద్దగీతను దాటుకుని అవతలివైపు మేడ మెట్ల దగ్గరకు వెళ్ళేడు. రెండు మూడు మెట్లెక్కి ఆ క్రమమెట్లు చేస్తున్న చప్పుడు తనలో ఏవో జ్ఞాపకాలు రేకెత్తించగా శూన్యంలో చీకట్లో గలాన్ని చూస్తూ అలాగే ఒక నిమిషం నిలబడి పోయేడు సత్యం.

■ ● ● ●

కింద కూర్చుని ముచ్చంకాయలు తరిగి నీళ్ళు పోసిన గిన్నెలో వేస్తూ, వాల్తేరులో ఉన్న తన కూతురి సంసారం గురించి వంటావిడ సర్వమ్మ ఏదో అంటున్న మాటలు పరధ్యానంగా వింటున్న గిరిజ, పడక కుర్చీలో పడుకుని గుండెలమీద తెరిచి ఉన్న పుస్తకమేదో పడేసుకుని ఎదుటి గోడమీద కాలెండర్ వైపు చూస్తోంది ఆలోచనగా. మెట్లమీద ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు వినబడి ఆమె అంది: "ఎవరో వస్తున్నట్లున్నారు, సర్వమ్మా."

కత్తిపీటకు ఎదురు తిరుగుతున్న పెద్ద పొడుగాటి వంకాయను గట్టిగా నొక్కి మధ్యకు చీలుస్తూ అంది సర్వమ్మ: "మీ తమ్ముడుగారి పందికొక్కులై ఉంటాయండీ."

శ్రద్ధగా విని అంది గిరిజ: "కాదు, సర్వమ్మా. ఆ చప్పుడు వేరు. ఎవళ్ళో మలుపు తిరిగిన చోటువరకూ వచ్చి ఆగిపోయేరు. అదిగో, మళ్ళీ ఎక్కుతున్నారు."

లేచి వసారాలో ఉన్న లైటు స్విచ్చి వేసి గుమ్మం దగ్గరకు వెళ్ళి మెట్లవైపు చూసింది గిరిజ. అప్పుడే ఆఖరు మెట్టెక్కి పైకి అడుగు పెట్టిన సత్యం ఆమెవైపు రెప్పవేయకుండా చూస్తూ ఉండిపోయాడు వాలుగైదు క్షణాలు.

వింతగా అతన్ని చూస్తూ ఆమె ఏదో అనబోయే టప్పటికి అతడే అడిగేడు: "గిరిజగారేనా?"

"అవును." పక్కకు గోడకున్న పేముకుర్చీ కొద్దిగా ముందుకు తోసి అంది: "రండి. కూర్చోండి."

సత్యం కుర్చీ దగ్గరకు వచ్చి కుర్చీమీద చేయి వేసి నిలబడి, "నేను... నేను..." అని ఏదో అనబోయి, ఆగిపోయి మళ్ళీ ఒక్క ఊపులో అన్నాడు: "నా పేరు శివులూరి సత్యనారాయణమూర్తి."

తలుపు పక్కను గోడమీద ఆనించుకున్న చేయి అక్కడ తేలో ఏదో ఉండి కుట్టినట్లుగా హఠాత్తుగా కిందికి జార్చుకుని కళ్ళు బాగా పెద్దవిగా చేసి నోరు సగం తెరిచి, అతన్ని చూస్తూ గిరిజ అలాగే ఉండిపోయింది బొమ్మలా.

ఆమె ఏమీ మాట్లాడకపోవడం చూసి జాలిగా అన్నాడు సత్యం: "గుర్తుపట్టలేదా? జ్ఞాపకానికి రాలేదా పేరు?"

"ఎవ్వా?! ఎంత మారిపోయేవు! నిన్ను మరిచిపోవడమా, సత్యం? కాని, బాగా నల్లగా అయిపోయేవు. పెద్దవాడివి కూడా అయ్యేవు. గొంతులో ఆ చిన్నప్పటి జీరంతా పోయి గంభీరంగా ఉం దిప్పుడు. అందుకే గుర్తు పట్టలేకపోయేను. అయినా అంత చిక్కిపోయిన ట్లున్నావేం, ఎముకలు పైకొచ్చి?" ఒక అడుగు ముందుకు వేసి గోడమీద చెయ్యి వేసుకు ముందుకు వంగి అతని మొగాన్ని పరీక్షగా చూసి ఆమె అంది: "అదుగో, పెదిమ కింద పుట్టుమచ్చ! ఏమిటో పరధ్యానంగా ఉండి సరిగా చూడ్లేదు ముందు." నిట్టూర్చి అంది: "అబ్బ! ఎన్నాళ్ళయింది నిన్ను చూసి?"

"పదకొండేళ్ళు!"

"అవును. అయ్యో, ఇక్కడే నిలబెట్టేసి మాట్లాడుతున్నాను. రా లోపలికి. ఎవళ్ళో పైవాళ్ళని ఇంకా ఇక్కడే కూచోమన్నాను. అవమానిస్తున్నావేం? రా."

ఆమె వెనక లోపలికి వెళ్ళి అక్కడ ఒక పేముకుర్చీ ఆమె చూపించగా అందులో కూర్చున్నాడు అతడు.

"నీ పెట్టె బాగ్ అవీ కింద నున్నాయా?"

జాలిగా నవ్వి సత్యం అన్నాడు: "ఒక హోల్డాలే. అ దక్కడ జంక్షన్ దగ్గర హోటల్లో పెట్టి వచ్చేను."

"సాయంత్రం రైను బస్సులో వచ్చేవా? ఏ రాముడు తాతని పంపిద్దాం తేవడానికి."

"ఇప్పు డక్కర్లేదు. వెళ్ళిపోతాను మళ్ళీ. కొద్దిగా పనుండి వచ్చేను."

"ఆహాఁ, అలాగా? సరేలే. ముందు కొద్దిగా కాఫీ తాగుదాం. ఇప్పుడే వస్తానుండు."

ఆమె లోపలికి వెళ్ళబోతుంటే అతడు అన్నాడు: "మానండి. ఏమీ అక్కర్లే దిప్పుడు నాకు. ఒక గళాసు మంచినీళ్ళు చాలును. కిందని టీ తాగాను."

లోపలి గుమ్మం దగ్గర ఆగి వెనక్కు చూసి మంచి

కుమారి బి. బాలాదేవి

ఏజంట్లు ఇంగ్లీషువాళ్ళు ఉన్నారు. వాళ్ళకూడా అసూయ పడేట్లుగా పూలతోట పెంచుకుందాం." భవిష్యత్తులో ఏదో సుందర దృశ్యం చూస్తూ ఆనందం అలముకుపోయిన మొహంతో గిరిజ అంది, చిరునవ్వు నవ్వుతూ: "అందరూ అనుకునే ఆడబడుచుతనం నా మరదలిమీద ఏనాడూ చూపించను. తన తల్లి ఎంతో నన్నూ అలాగే చూసుకోవాలి ఆ అమ్మాయి ... ఏలాటిదైనా సరే, మంచితనంతో ఒక దేవతలా మార్చేస్తాను దాన్ని .... నా బిడ్డ అలా ఏంజల్‌లా ఉండాలి. నా తమ్ముడూ నన్ను అక్కలాగే —కాదు— తన తల్లిలా—తన సర్వస్వంలా చూసుకుంటాడు." అతడు ఉలికిపడినట్లుగా ఆమె వైపు చూశాడు. ఆమె గమనించలేదు. తన ధోరణిలో మాట్లాడుతూంది. "నా కింకేం కావాలి? ఎప్పుడూ అనుకోలేదు మళ్ళీ ఇంత అదృష్టం పడుతుందని!" కళ్ళ వెంబడి నీళ్ళు కారిపోతున్నాయన్న స్పృహ లేకుండా ఆనందంగా అంది: "ఆ అమ్మాయి పేరేమి టుంటుందో? ఏమైనా లక్ష్మి అని పిలుచుకుంటాను. పది రకాల లక్ష్ములు ఉన్నారట. ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, సంతానలక్ష్మి ఇలా ఎవ రెవరో. అన్నీ ఆమే నాకు. ఈ ఇంటికి లక్ష్మి నా మరదలు. అబ్బ!"

ఆనందం పట్టలేక లేచిపోయి పక్కమీద చేతులు వేసి అతని మొహం చూస్తూ అంది: "కదూ, తమ్ముడూ! ఏదీ అను — 'అవునక్కా' అని...అను—"

మగతగా ఏదో ఈ లోకానికి చెందని గొంతుతో అన్నాడు సత్యం: "అవునక్కా!"

"అబ్బా! ఇన్నాళ్ళకి నన్ను నోరార అక్కా అని పిలిచే తమ్ముడు దొరికాడు. దేవతలారా! ఎవళ్ళూ అసూయ పడకండి. దీవించండి మమ్మల్ని .... అక్కా తమ్ముళ్లని." రెండు చేతులూ జోడించి అవతల దూరంగా కనిపిస్తున్న ఆకాశంమీద వెలుగుతున్న నక్షత్రాలను ప్రార్థించింది ఆమె.

"అక్కాతమ్ముళ్ళు ... తమ్ముణ్ణి నేను — ఎంత హాయి! ఎవరో దేవత మాట్లాడుతూంది. ఎవళ్ళూ అసూయ పడకండి, దీవించండి మమ్మల్ని." చిలకలా మనసులో ఈ మాటలు అనుకున్నాడు సత్యం. ఎంతో భౌతికమైన బాధలో ఉన్నవాడికి ఆ బాధ అనుభవించే శక్తిని లాగేసే ఇంజక్షన్‌లా ఉంది ఆ గొంతు.

గిరిజ గట్టిగా కళ్ళు మూసుకుని ఊపిరి పీల్చుకుని వదిలి అంది కళ్ళుతెరిచి అతన్ని చూస్తూ: "ఏమిటో వెర్రిదానిలా వాగుతున్నాను. చాలా ఆలస్యమైపోయింది. పడుకో సత్యం!" ఈ మాటలలో ప్రపంచంలోని మార్దవమంతా కూరి అంది ఆమె.

"ఎబ్బే—రాత్రంతా నువ్వు అలా మాట్లాడుతూన్నా వినాలనే ఉంది. చెప్పు. ఇంకా చెప్పు."

గిరిజ కిలకిల చంటిపిల్లలా అమాయకంగా నవ్వింది. "చెప్పాలి. నీకన్నీ చెప్పాలి. కాని...ఎన్ని రాత్రులు లేవు మనం మాట్లాడుకోడానికి? ఈవాళకి పడుకో తమ్ముడూ!" ముందుకు వంగి అతని మొహాన్ని చూస్తూ మాట్లాడుతున్న ఆమెలో యుగయుగాల మాతృత్వం పొంగి పొరలింది. మృదువుగా కుడిచేతితో అతని నుదుటిమీద పడుతున్న జుట్టును వెనకకు తోసి ఆ కళ్ళలోనికి చూసింది ఆప్యాయంగా ఆమె. ఆనందపు మైకంలో నిద్ర మత్తుగా ఉన్న అతని ఒళ్ళంతా

# వెనుకకు తిరిగిన కాలచక్రం

జలజల పులకరించింది. అలసిపోయినట్లుగా చిరునవ్వు నవ్వుతూ కళ్ళు మూసుకున్నాడు. ఆమె నెమ్మదిగా అంది: "ఎంత నీరసంగా ఉంది నీ మొహం! లేదు, ఆలస్యం చెయ్యకూడదు. రేపే వెళ్ళాలి డాక్టరు పారథిగారి దగ్గరకు. టాక్సీకి ఉదయమే కబురు పెడతాను జంక్షన్‌కి." ఆగి అతని కాళ్లవైపు వెళ్ళి అక్కడ పరుపుకింద ఉంచిన దుప్పటి ముట్టుకుని చూసి అంది: "తెల్లవారు ఝామున చలేస్తే కప్పుకో. దుప్పటి ఇక్కడ ఉంది. ఏం?" అతడు మాట్లాడకపోవడం చూసి అంది అతని మొహం చూస్తూ: "నిద్దరొచ్చేసిందా అప్పుడే? ఎంత అలిసిపోయి ఉన్నావో!"

బోర్లా పడుకుని దిండులో మొహం దాచుకుంటూ అన్నాడు సత్యం: "నువ్వే అలిసిపోయావు మాట్లాడి, మాట్లాడి. వెళ్ళు. పడుకో."

ఆమె గది లోపలికి వెళ్లి వసారాలోని పెద్దలైటు ఆర్పి రెండువైపులా కనిపించేలా ద్వారబంధానికి వేలాడుతున్న చిన్న నారింజరంగు బల్బు వెలిగించి గుమ్మందగ్గరికి వచ్చి అంది: "తలుపులు తీసే ఉంటాయి. మంచినీళ్లిక్కడే కూజాలో ఉన్నాయి. గళాసు కూడా ఉంది. ఏమన్నా కావలిస్తే పిలు, తమ్ముడూ."

మత్తుగా "ఊఁ" అన్నాడు సత్యం.

* * *

రివ్వురివ్వుమని వీస్తున్న గాలితో హఠాత్తుగా మెలుకువ వచ్చింది సత్యానికి. మే నెలలో అప్పుడప్పుడు వచ్చే వేసవి తుఫాను మబ్బు నల్లగా ఆకాశాన్ని కమ్ముకుంటున్నది. దూరంగా ఎక్కడో కుక్కలు మొరుగుతున్నాయి. తళతళ మెరుపులు మెరుస్తున్నాయి.

తానెక్కడ ఉన్నాడో వెంటనే స్పృహ రాలేదు సత్యానికి. అటూ ఇటూ చూసేడు మగతగా, వెర్రిగా ద్వారబంధానికి వేలాడుతూ ఊగుతున్న నారింజ రంగు బల్బు చూడగానే మెరుపు కొట్టినట్లయి తుళ్లిపడి లేచి కూర్చున్నాడు. పదకొండేండ్ల కిందట ఆ రాత్రి చూసిన దృశ్యం తటాలున జ్ఞాపకం వచ్చింది. కాదు, కాదు — అదెప్పుడో జరిగిపోయిన సంఘటన. మళ్లీ పదకొండేళ్ల తరవాత వచ్చేడు తానీ ఇంటికి నిన్న సాయంత్రం. ఆ వెంటనే అతనికి పడుకునే ముందు సాయంత్రంనించీ జరిగిందంతా జ్ఞాపకం వచ్చింది నెమ్మదిగా. గుండెల దడ తగ్గింది. మళ్లీ వెనకకు వాలి పడుకున్నాడు.

నల్లని మబ్బు ఆకాశమంతా అలుముకుంది. పెద్ద పెద్ద లారీలు గోతుల రోడ్లమీద పరుగెత్తుతున్నట్లు చప్పుడు చేస్తున్నాయి. దూరంగా ఉరుములు

> ప్రజాక్షేమమే పరమాత్మ శాసనం.
>
> — జేమ్స్ ఓటిస్

ఉరుముతున్నాయి. మెరుస్తున్న మెరుపులలో కొబ్బరి చెట్ల ఆకులు వింతగా ఊగుతూ కనపడుతున్నాయి. వాతావరణంలో అంతకంతకూ ఎక్కువవుతూన్న విద్యుచ్ఛక్తికి తట్టుకోలేని నారింజరంగు బల్బు ఒక్కసారి ఆరిపోయి మళ్లీ అంతలో వెలిగింది.

రాత్రి గిరిజ మాటలు స్పష్టంగా మళ్లీ వినపడుతున్నాయి అతనికి. నిన్న అనిపించిన హాయిమటుకు ఇప్పుడు లేదు. గుండెలు మాటిమాటికీ కలుకుకలుకుమంటున్నాయి.

ఏదో బరువుగా కడుపులోనుండి ప్రయాణం చెయ్యడం మొదలుపెట్టి గొంతువరకూ వచ్చి ఆగిపోయింది. ఊపిరి తిరగడం లేదు. నాలుక పిడచ గట్టినట్లుగా అయి దాహం వేస్తున్నది.

అతి కష్టంమీద మంచం దిగి గుమ్మం దగ్గరకు వెళ్ళేడు. ఆ లోపల కూజాలో మంచినీళ్ల కోసం గుమ్మం దాటి ఒక అడుగు వేసి మంచం వైపు ఒకసారి చూసిన కళ్ళు మరి మూత పడకుండా అలాగే వెర్రిగా తెరుచుకుని ఉండిపోయేయి. గుండెలు టక టక కొట్టుకోడంతప్ప అతనిలో తక్కిన చలనమంతా ఆగిపోయింది.

లేత నారింజరంగులో కనిపిస్తున్న తెల్లని పక్క — దిండుమీద చిందరవందరగా గాలికి ఎగురుతున్న మబ్బులాటి నల్లని జుట్టు—కిందికి జారిపోయి పక్కమీద పడిఉన్న పైట—లేత కుంకుమరంగు జాకెట్టు —సన్నగా నిగనిగలాడుతూ తమ అసలు గులాబీ రంగుకు మరింత వన్నె తెచ్చుకు కనిపిస్తున్న వేళ్ళూ, అరచేయీ, జబ్బలూ, మొహమూ, మెడా, మెడకింది భాగమూ, కడుపూ, మీగాళ్ళూ, అడుగులూ — సగం తెరుచుకుని ఉన్న మెత్తని గులాబీరంగు పెదవుల నడుమ వెలుగులుపడి ప్రతిఫలిస్తున్న దానిమ్మగింజల వంటి పలువరసా — వింతరకపు పెద్ద పూల మొగ్గల జంటలా కనిపిస్తూన్న కళ్ళూ, గుండ్రని బుగ్గలూ, పొడుగుపాటి బంగారు సంపెంగపూవువంటి ముక్కూ— లేత గులాబీరంగు ముద్దమందారపువ్వులా ఉన్న చిరుగడ్డమూ — ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో పైకి లేస్తూ కిందికి దిగుతూన్న ఆ....ఆ....అమృతం నిండిన మనస్సే పొంగిపోయి లేస్తున్నదా ఇలా?...ఎవరిదీ అందమైన రూపం? ఎవరా దేవకన్య?

కాదు...కాదు...దేవకన్య కాదు...కళ్ళు మూసుకోవు వాళ్లకు...అనిమేషులు వాళ్ళు.....

ఇది....ఇదీ గిరిజ! గిరిజ!! గిరిజ!!!

* * * *

కాలచక్రం వెనకకు తిరిగి పదకొండేళ్ల దూరం దొరిలింది.

రివ్వు రివ్వుమని వీస్తున్న గాలిలో హఠాత్తుగా మెలుకువ వచ్చింది పంతొమ్మిదేళ్ల సత్యానికి.

నల్లని మబ్బు ఆకాశమంతా అలుముకుంది. పెద్ద పెద్ద లార్రీలు గోతుల రోడ్లమీద పరుగెత్తుతున్నట్లు చప్పుడు చేస్తున్నాయి. దూరంగా ఉరుములు ఉరుముతున్నాయి. మెరుపులలో కొబ్బరిచెట్ల ఆకులు వింతగా ఊగుతూ కనపడుతున్నాయి. వాతావరణంలో అంతకంతకూ ఎక్కువవుతున్న విద్యుచ్ఛక్తికి తట్టుకోలేని నారింజబల్బు ఒక్కసారి ఆరిపోయి మళ్లీ అంతలో

వెళ్ళింది.

సత్యం మంచం దిగి గుమ్మందగ్గరకు వెళ్ళేడు కూజాలో మంచినీళ్ళ కోసం. గుమ్మం దాటి ఒక్క అడుగువేసి ఆ లోపల మంచంవైపు ఒకసారి చూసిన కళ్ళు మరి మూతపడకుండా అలాగే వెర్రిగా తెరుచుకుని ఉండిపోయేయి. గుండెలు టకటక కొట్టుకోడంతప్ప అతనిలో తక్కిన చలనమంతా పూర్తిగా ఆగిపోయింది, ఆ మంచంమీద ఒంటిమీది బట్టలు తొలిగిఉన్న పద్దెనిమిదేళ్ళ గిరిజను రెప్పవాల్చకుండా చూస్తుంటే.

ఎంతసేపు అలా ఉన్నాడో తెలియదు అతనికి వాతావరణంలోని విద్యుచ్ఛక్తితో మరి వెలలేకపోయిన వారింజరంగు బల్బు ఆరిపోయి మళ్ళీ వెలగలేకపోయింది.

అతని ఒళ్ళంతా గజగజ వణకడం మొదలుపెట్టింది. ఎముకలగూడులో విలవిల తన్నుకుంటూంది గుండె. అతివేగపు సంకోచవ్యాకోచాల్లో సతమతమవుతున్నాయి ఊపిరితిత్తులు. చెవులలోనుండి వేడివేడి పొగలు వస్తున్నాయి. ఒక్క ఉదుటున వెళ్ళి ఆమెను...

ఆగిపోయింది గుండె ఒక్కసారిగా. ఏమిటీ పాపపు టాలోచన? ఆమె గిరిజ! గిరిజక్క!! గిరిజక్క!!!

హఠాత్తుగా రెండుచేతులతోనూ మోహం కప్పుకొనివచ్చి మంచంమీద కూర్చున్నాడు మోకాళ్ళమీద తల పెట్టుకుని, చేతులు మోకాళ్ళమీద పెనవేసుకుని.

పెంపుడు కొడుకుగా ఈ ఇంటికి తను వచ్చిననాటి సాయంత్రంనించి మనస్సులో ఊగులాడుతున్న అశాంతికి, గిరిజ తనను తమ్ముడూ అని పిలిచినప్పుడల్లా కలుగుతున్న చిరాకుకు, 'అక్కా' అని నోరారా తాను ఆమెను ఎప్పుడూ పిలవనీకుండా చేస్తున్న పిరికితనపు జంకుకు — ఈ ఇంటికీ, తనను కన్నకొడుకులా చూసుకుంటున్న ఆయనకూ, తనను తమ్ముడుగా ఆదరంతో అభిమానంతో చూస్తున్న గిరిజకూ తానేదో ద్రోహం చేస్తున్నానన్న అనుమానానికి— ప్రతి క్షణమూ తన మనసు నిండా గుచ్చుకుంటున్న ముళ్ళకు...అంతకూ, అన్నిటికీ కారణం ఒక్కసారిగా ఆ క్షణంలో అతనికి విపులంగా, వివరంగా బోధపడడం మొదలుపెట్టింది.

లాభంలేదు. లాభంలేదు. ఈ ఇంటికి తానెప్పుడూ కొడుకు కాలేడు—గిరిజనెప్పుడూ అక్కగా చూడలేడు. తనకీ ఇంట్లో స్థానం లేదు .... లేదు. తన కెప్పుడూ ఎవళ్ళూ లేరు. ఒంటరి, తాను ఒంటరి! తనకు ఉన్నదొకటే... గిరిజ మనస్సులో తనపైని సోదర ప్రేమ....ఎల్లలు లేకుండా పొంగి పొరలే అభిమానపు అమృత ప్రవాహం! తనుమాత్రం దానిని అనుభవించలేకపోయినా అదిమటుకు అలాగే ఉండిపోవాలి ఎప్పుడూ. తానెలా ఉన్నాసరే...ఎంత బాధ అయినాసరే— తన బాధమటుకు ఆమెకు తెలియకూడదు. తనలోని పశుత్వం, రాక్షసత్వం వీటి గాలి ఆమెకు ఎంత మాత్రమూ సోకరాదు.

ఈ ఇల్లు వదిలి వెళ్ళిపోవాలి! అవును, వెళ్ళాలి. కాని ఎలా వెళ్ళడం! గిరిజను వదిలి ఎలా వెళ్ళడం? తనకు సర్వస్వమూ అయిన గిరిజను?

అతని గొంతు చీల్చుకుని నిశ్శబ్దంగా పెదవులు కదలిస్తూ ఒక నిస్సహాయమైన ఆక్రందన పైకి వచ్చింది.

"భగవాన్!"

వెనకకు తిరిగిన కాలచక్రం ఇదివరకు తను నడిచిన దారినే ముందుకు దొర్లుతూంది.

మునవ్వయ్యేళ్ళ సత్యంజీవచ్ఛవంలా చప్పుడు కాకుండా మెట్లుదిగి కిందక వరండామీదికి వచ్చి వెనకకు తిరిగి మెట్లవైపు చూశాడు. ఆపైన వెలుగు, కింద చీకటి — అవతల చీకటిని ఏడిపిస్తున్న వాన! తన చోటు, ఈ పశువు చోటు అక్కడ, అవతల! కళ్ళు గట్టిగా మూసుకుని తనలో అనుకున్నాడు.

"నామీద నీకు ఉన్న అభిమానం ఎప్పుడూ అలాగే ఉండిపోనీ! ఈ అభాగ్యుణ్ణి తమ్ముడిగానే ఎప్పుడూ అనుకో! ఈ పశుత్వం, ఈ రాక్షసత్వం వీటిగాలి నీకెప్పుడూ సోకకూడదు. ఎక్కువ రోజులు బతకను! బతకాలని లేదు. ఎప్పుడన్నా నేను చచ్చిపోయానని కబురు తెలిస్తే ఒక్క కన్నీటి చుక్క కార్చు, గిరిజా, నాకోసం! సెలవు. సెలవు, గిరిజా!"

రెండుచేతులూ పైకెత్తి జోడించి, మళ్ళీ కిందికి దించుకుని వడివడిగా నడుస్తూ వరండా దిగి చప్పుడు కాకుండా గేటు తీసుకుని జోరుగా పడుతూన్న వానలో, ఏడుస్తూన్న చీకటిలో కలిసిపోయాడు సత్యం.

మళ్ళీ మామూలుగా దొర్లిపోతూంది కాలచక్రం!

★

[సంహో. ఆర్య సంప్రదాయం ప్రకారం కథావస్తువు సుఖాంతంగా ఉండాలి అనుకునే చదువరులందరూ "హఠాత్తుగా 'ఊఁ' అన్నాడు సత్యం" అన్న వాక్యం తరవాత ఉన్నదంతా ఎర్రపెన్సిలుతో కొట్టిపారెయ్యండి. ఊహాలోకంలోనన్నా జీవితాలు, ఏ మానసిక సంఘర్షణకూ, నొప్పికీ ఆస్కారం లేకుండా సుఖవంతంగా సుందర స్వప్నాలలా కనిపిస్తాయి. •

—రచయిత్రి]



కత్తిరింపు చిత్రం—కుమారి ఎ. టి. సేత (మద్రాసు-4)